## ఘనంగా మల్లన్న జాతర



**కోరుట్ల రూరల్:** మండలంలోని సంగెంలో సంగమహేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని మల్లన్న స్వామి ఆలయంలో ఆదివారం జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు నిర్వహించారు.భక్తులు మల్లన్నకు బోనాలు సమర్పించారు.కార్యక్రమంలో ఆచార మంతుల సంఘం, యాదవ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చలి బోనాల వేడుక

**కథలాపూర్/ ఇబ్రహీంపట్నం:** రెండు మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం పోచమ్మ చలి బోనాలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున చలి బోనాలతో భక్తులు పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తి శ్రద్ధలతో పోచమ్మ ఆలయాల వద్దకు వెళ్లి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.
**మెట్‌పల్లి:** పట్టణంలో పోచమ్మ చలి బోనాల వేడుకలను ఆదివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. బోనాలతో ఆలయాల వద్దకు తరలివచ్చి పూజలు చేశారు. అనంతరం బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.





## క్లుప్తంగా

### యువత సన్మార్గంలో ముందుకెళ్లాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై

**మల్లాపూర్:** యువత సన్మార్గంలో ముందుకెళ్లాలని ఎస్సై నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని వీవీరావుపేటలో నిర్వహిస్తున్న వీవీరావుపేట ప్రీమియర్ లీగ్(వీపీఎల్) క్రికెట్ టోర్నీని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో యువత సామాజిక స్పృహ అలవర్చుకోవాలన్నారు. వీవీరావుపేట ప్రీమియర్ లీగ్(వీపీఎల్) కోసం ఫ్రాంచైజీలు జట్లను కొనుగోలు చేసి టోర్నమెంట్‌ను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బిట్ల సరోజన, జోగుల మమత, ఎంపీటీసీలు తోట సుజాత, గుగ్లావత్ భూమి, నాయకులు బిట్ల నరేశ్,తోట శ్రీనివాస్, మ చ్చర్ల దశరెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థికి సన్మానం



విద్యార్థిని అభినందిస్తున్న నాయకులు

**మల్లాపూర్:** మండలంలోని చిట్టాపూర్‌కు చెందిన విద్యార్థి హర్షవర్ధన్‌రాజు అండర్–12 రాష్ట్ర స్థాయి లాంగ్‌జంప్ పోటీలకు ఎంపికవడం గర్వకారణమని బట్రాజ కులసంఘం అధ్యక్షుడు అర్వ శ్రీనివాసరాజు అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో ఆదివారం బట్రాజ కులసంఘం ఆధ్వర్యంలో విద్యార్థిని సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్షవర్ధన్‌రాజు రాష్ట్రస్థాయి పోటీల్లో హర్షవర్ధన్‌రాజు విజయం సాధించి గ్రామానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బట్రాజ కులసంఘం సభ్యులు సంజయ్‌రాజు, చంద్రశేఖర్‌రాజు, శ్రీనివాసరాజు, విష్ణువర్ధన్‌రాజు, కమలాకర్ రాజు, నాగరాజు, మహేందర్‌రాజు, అంజమ్ రాజు, కృష్ణంరాజు, రవీందర్‌రాజు, నరేందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

### నేడు మార్కండేయ జయంతి



ప్రభుత్వ విప్‌ను ఆహ్వానిస్తున్న నాయకులు

**ధర్మపురి:** పట్టణంలోని మార్కండేయ ఆలయంలో సోమవారం స్వామివారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు నక్క రాజేందర్ తెలిపారు. కార్యక్రమాల్లో భాగంగా ఉదయం 9 గంటలకు స్వామివారి రుద్రాభిషేకం అనంతరం మహిళలచే కుంకుమార్చన, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేడుకలకు హాజరు కావాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఆహ్వాన పత్రం అందించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొంక వరప్రసాద్,నాయకులు మచ్చ సత్యం,గడ్డం అనిల్, ఎలగందుల బుచ్చన్న పాల్గొన్నారు.

### సామాజిక సేవకుడు మున్నుకు డాక్టరేట్

**రాయికల్:** పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు ముస్తాక్ అహ్మద్ మున్ను డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్‌లో రవీంద్ర భారతిలో ఆదివారం అల్లూరి కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాల చారి, సోషల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు విల్సన్ , సినీనటుడు మణిచందన్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మున్నును పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

# మీ సేవా కేంద్రం పునరుద్ధరణ ఎప్పుడో?

- ఏడేళ్లుగా నిలిచిన సేవలు
- వివిధ సేవలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మండల కేంద్రానికి వెళ్లాలంటే దూర భారం



మొగిలిపేట 'మీ సేవా' కార్యాలయం (ఫైల్)

**మల్లాపూర్:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు చేరువగా ప్రభుత్వ రంగ సేవలు అందించాలని ప్రభుత్వం 'మీ సేవా' కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ కరువవడంతో కొన్ని' మీ సేవా' కేంద్రాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని మొగిలిపేటలో గత ఏడేళ్లుగా 'మీ సేవా' కేంద్రం మూతపడి సేవలు నిలిచిపోయినా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. 'మీ సేవా' కేంద్రం నిర్వాహకుడు చిట్యాల చంద్రశేఖర్ అనారోగ్యంతో 2016 డిసెంబర్‌లో మృతి చెందగా, అప్పటి నుంచి మొగిలిపేటలో మీ సేవ సేవలు నిలిచిపోయాయి. మండలంలో రెండో అతిపెద్ద గ్రామంగా ఉన్న మొగిలిపేటలో మీ సేవా కేంద్రం లేక , విద్యార్థులు, వ్యాపారస్తులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మొగిలిపేటలో మీ సేవా కేంద్రాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

## ప్రజలను మభ్య పెట్టేందుకే ప్రజాహిత యాత్ర



మాట్లాడుతున్న లోక బాపురెడ్డి

**కథలాపూర్:** పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలను మభ్య పెట్టి ఓట్లు దండుకునేందుకే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రజాహిత యాత్ర చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి అన్నారు. ఆదివారం కథలాపూర్‌లో మాట్లాడారు. ఐదేళ్ల కాలంలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఎన్ని నిధులు కథలాపూర్ మండలానికి మంజూరు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. కొండగట్టు హనుమాన్ దేవాలయం అభివృద్ధికి ఎంపీ కోటాలో ఎన్ని నిధులు వెచ్చించారో చెప్పాలన్నారు. దేశం కోసం ధర్మం కోసం అంటూ యువకులను రెచ్చగొట్టితే వచ్చే ఎన్నికల్లో ఎంపీకి ప్రజలే బుద్ధి చెప్పుతారన్నారు. కేంద్రం ప్రభుత్వ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ లాంటి వాటిని ప్రైవేట్ పరం చేశారని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, నాయకులు గుండారపు గంగాధర్, నాగేశ్వర్‌రావు, కొండ ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## దగ్గులమ్మ ఆలయంలో ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న జీవన్‌రెడ్డి

**జగిత్యాలటౌన్:** పట్టణంలోని 29వ వార్డు తెనుగువాడలోని దగ్గులమ్మ ఆలయంలో ఆదివారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ముదిరాజ్ సంఘం సభ్యుల కోరిక మేరకు సంఘం భవన నిర్మాణానికి నిధులు విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ వెంట నాయకులు గిరి నాగభూషణం, జున్ను రాజేందర్, రమేశ్‌రావు, పెద్దులు, నాంచారి రాజు, బొల్లి శేఖర్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లారమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి



నంచర్లలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

**పెగడపల్లి:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని నాయకులు కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై బీజేపీ నాయకులు ఆదివారం మండలంలోని నంచర్ల, రాములపల్లి గ్రామాల్లో పల్లెకు పోదాం–బస్తీకి పోదాం కార్యక్రమంలో భాగంగా నాయకులు కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశాభివృద్ధితో పాటు సుస్థిరపాలన అందించడం బీజేపీకే సాధ్యమన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వాన్ని ఎన్నుకుని, నరేంద్ర మోదీని పీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం, మండల అధ్యక్షుడు గంగుల కొమురెల్లి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద యువతి వివాహానికి ఆర్థికసాయం



సాయం అందిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

**రాయికల్:** మండలంలోని అల్లీపూర్‌లో నిరుపేద యువతి గాయత్రి వివాహం ఆదివారం జరుగగా, గ్రామానికి చెందిన ఉషోదయ, రైడర్స్ యూత్, డాక్టర్ శశికాంత్ రెడ్డి, సౌదీ అరేబియాలో ఉన్న మండ లక్ష్మారెడ్డి, రాజరెడ్డి, ఎంబెరి సురేష్, వెంకటేష్, మురళి మిత్రబృందం సభ్యులంతా కలిసి ఆదివారం రూ.75వేలు ఆర్థికసాయం చేశారు. వివాహానికి హాజరైన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆర్థిక సాయం అందించి నూతన వధువరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ట్యాంకులు శుభ్రం



బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

**మల్యాల:** ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులు వాటర్ ట్యాంకులను శుభ్రం చేశారు. వాటర్ ట్యాంకుల వద్ద పిచ్చిమొక్కలు తొలగించి, మొక్కలు నాటారు. గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడంతో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో వెంకటేశం కోరారు. కనీసం వారానికి ఒకసారి ట్యాంకులు శుభ్రం చేయాలని ప్రజలు కోరారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**జగిత్యాలరూరల్:** జగిత్యాల పట్టణంలోని అన్నపూర్ణ టాకీస్ సమీపంలోని భీష్మ నగర్‌కు చెందిన కోండ్ర సాగర్ గత కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు మృతిచెందగా, అతని ప్రాణ స్నేహితుడు బింగి నరేశ్ మౌనిక దంపతులు ఆదివారం అతని కుటుంబ సభ్యులకు రూ.4.50 లక్షల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా బింగి నరేశ్, మౌనిక దంపతులను ఆరుముళ్ల హరి, సూరజ్ శివశంకర్, తోపారపు రవి, ఆరుముళ్ల నారాయణ, లక్ష్మీ నారాయణ, గంగరాజం అభినందించారు.

**బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం**

**మేడిపల్లి:** భీమారం మండల కేంద్రానికి చెందిన యువకుడు దయ్య సురేశ్ ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబ పరిస్థితిని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా ఫోన్‌లో పరామర్శించి ప్రభుత్వ పరంగా కూడా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు బక్కురి నరేశ్‌కు సూచించారు. కార్యక్రమంలో శంకర్ గౌడ్, సంజీవ్, సత్యనారాయణ, ధ్యావనపెల్లి అనిల్, కొత్తూరు లక్ష్మణ్, కొత్తపల్లి రమేష్, పల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు

## అయ్యప్ప ఆలయ అధ్యక్షుడిగా అంబటి శ్రీనివాస్



శ్రీనివాస్

**కోరుట్ల:** పట్టణంలోని అయ్యప్ప జ్ఞాన సరస్వతి ఆలయ అధ్యక్షుడిగా అంబటి శ్రీనివాస్ గెలుపొందారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష పదవి కోసం అంబటి శ్రీనివాస్, దగ్గుల నర్సయ్య పోటీ పడగా, నరయ్యపై 386 ఓట్ల మెజార్టీతో అంబటి శ్రీనివాస్ గెలుపొందినట్లు అధికారులు పోతని ప్రవీణ్, ఆకుల రాజేశ్ ప్రకటించారు. మొత్తం 1289 ఓట్లకు గాను 826 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షుడు గురుస్వామి చిద్రాల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా రంగు గోపాల్

**జగిత్యాలటౌన్:** బీజేపీ జగిత్యాల పట్టణ అధ్యక్షుడిగా రంగు గోపాల్, బీర్‌పూర్ మండల బీజేపీ అధ్యక్షుడిగా ఆడెపు నర్సయ్యను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణం అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులందరికీ గోపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

## కేపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

**కోరుట్ల:** పట్టణంలో కేపీఎల్ సీజన్–4 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. పట్టణంతో పాటు వివిధ గ్రామాల క్రికెట్ జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి. మొదటి మ్యాచ్‌ను పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు అన్నం అనిల్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ గౌడ్ పారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జిందం లక్ష్మీ నారాయణ, నీలి శ్రీనివాస్, అన్వర్, నిర్వాహకులు మొయిజ్, శబ్బీర్, బారి, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన విద్యార్థుల వీడ్కోలు వేడుక



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

**జగిత్యాలటౌన్:** అల్ఫోర్స్ వార్వెల్ పేరుతో నిర్వహించిన వీడ్కోలు వేడుకలు విద్యార్థుల ఆటపాటలతో అలరించాయి. జగిత్యాల పట్టణంలోని అల్ఫోర్స్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన వేడుకలను చైర్మన్ నరేందర్‌రెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి విజయాల పట్ల ఆతృత ప్రదర్శించాలన్నారు. పోటీతత్వం అలవరచుకుని అన్నింటా ముందుండాలని సూచించారు.కళాశాల విద్య చాలా ఉన్నతమైనదని, ఒత్తిడికి దూరంగా ఉండి సత్ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



హోమంలో పాల్గొన్న భక్తులు

**కోరుట్లటౌన్/మెట్‌పల్లి/ సారంగాపూర్/మల్లాపూర్:** కోరుట్ల పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో, మెట్‌పల్లి,మల్లాపూర్,సారంగాపూర్‌లోని వాసవీమాత ఆలయాల్లో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలతో పాటు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. మల్లాపూర్ యజ్ఞశాలలో చండిహోమం నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్శనం చేసుకున్నారు. కోరుట్లలో అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షులు మైలారపు రాము, దొంతుల లక్ష్మీనారాయణ, కొత్త నవీన్, కోట కిరణ్, చిట్టిమెల్లి శ్రీనివాస్, ఎలగందుల సంతోష్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ జోనల్ చైర్మన్ శివ శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు చౌడారపు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సంఘం శ్రీనివాస్, వెంకట్రాములు,శివ రాంకిషన్, నీలి కాశీనాథం, కొత్త సురేశ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్

**ధర్మపురి:** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి ఎంపీడీవో కార్యాలయంలో 50 మంది లబ్ధిదారులకు ఆదివారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు.ప్రభుత్వం ప్రకటించిన ఆరుగ్యారంటీ పథకాలతో పేదల జీవితాల్లో గణనీయమైన మార్పులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సత్తెమ్మ, జెడ్పీటీసీ అరుణ,డిప్యూటీ తహసీల్దార్ సుమన్,మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వేముల రాజేశ్, నాయకులు సింహరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి వైద్యానికి ఎమ్మెల్యే భరోసా



చిన్నారిని ఎత్తుకున్న ఎమ్మెల్యే సత్యం

**కొండగట్టు:** కొడిమ్యాలకు చెందిన చిలువేరి నరేశ్–శరణ్య దంపతుల నాలుగు నెలల చిన్నారి గుండెకు రంధ్రం పడగా, హైదరాబాద్ రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. డాక్టర్లు చికిత్సకు రూ.8 లక్షలు ఖర్చవుతాయన్నారు. విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను కలిసి ఓదార్పునిచ్చారు. చిన్నారి చికిత్సకు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం చేస్తామని, తాను సొంతంగా లక్ష రూపాయలు ఇస్తానని భాదిత కుటుంబానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు చిలువేరి నారాయణ.గడ్డం జీవన్‌రెడ్డి,ప్రభాకర్‌రెడ్డి,ముత్యం శంకర్‌గౌడ్,మల్లిఖార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

### ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

**మెట్‌పల్లి:** పట్టణంలో ఆదివారం నిర్వహించిన గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మహాత్మా జ్యోతిబాపూలే బీసీ, ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిల్లో 512మంది విద్యార్థులను కేటాయించగా.. 484మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్స్ కోటగిరి ఆనందం, సరిత తెలిపారు.

**ఆశ్రమ విద్యార్థులకు టవళ్లు పంపిణీ**

**ఇబ్రహీంపట్నం:** రిటైర్డ్ టీచర్ కాశెట్టి వెంకటేశం మృతి చెందగా, ఆయన జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు మండలంలోని మిచ్చమ్మ ఆశ్రమం వద్ద విద్యార్థులకు టవళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ విద్యార్థులు పాల్గొన్నారు.

**సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ**

**ఇబ్రహీంపట్నం:** మండలంలోని వేములకుర్తిలో ఈజీఎస్ నిధులు రూ.7లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామప్రత్యేకాధికారి కృపాకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**పండిత్ దీన్ దయాళ్‌కు నివాళి**

**కోరుట్ల రూరల్:** పట్టణంలో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోరపెల్లి సత్యనారాయణ రావు, నాయకులు తిరుమల వాసు, నర్సయ్య, రాజేంద్ర ప్రసాద్, సాయి చందు, చాంద్ పాషా, పాల్గొన్నారు.

**కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు**

**పెగడపల్లి:** మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ఆదివారం మంచినీటి పథకాల ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు, మంచినీటి బావులను శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ట్యాంకుల చుట్టూ ఫినిషింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో పులయ్య, ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, కారోబార్లు పాల్గొన్నారు.

### పౌరహక్కుల నేత అరెస్టును ఖండిస్తున్నాం

**బుగ్గారం:** పౌరహక్కుల సంఘం నేత రాజేశం అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని మానవహక్కుల సంఘం నాయకుడు చుక్క గంగారెడ్డి అన్నారు.జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామానికి చెందిన రాజేశంను ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో ఆయనకు, ఆయన కుటుంబసభ్యులకు ఏలాంటి సమాచారం ఇవ్వకుండా బలవంతంగా తీసుకెళ్లడం హేయమైన చర్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రాజేశంను అక్రమ నిర్బంధం నుంచి రక్షించాలని డిమాండ్ చేశారు.